# తెలంగాణ వచ్చాకే ఉద్యోగం వచ్చింది

### పైరవీలు లేకుండా ఉద్యోగం సాధించా..



నిరుపేద కుటుంబానికి చెందిన నేను సర్కారు కొలువు కోసం ఏండ్ల తరబడి ఎదురు చూసిన. మా అమ్మానాయిన చాలా కష్టపడి నన్ను చదివించిండ్రు. సర్కారు కొలువు రావాలని వాళ్లు మొక్కని దేవుడు లేడు. నేను కూడా వారి ఆశయాన్ని నెరవేర్చాలని ఎంతో కష్టపడి చదివిన. పోలీస్ ఉద్యోగం చేయాలనే సంకల్పంతో ముందకు వచ్చాను. కానీ కొందరు పోలీస్ ఉద్యోగం అంటే చాలా కష్టమని, ఎన్నో పైరవీలు ఉంటాయని హేళన చేసిండ్రు. కానీ నేను అవి ఏవీ లెక్క జేయకుండా నమ్మకంతో చదివాను. 2020లో తెలంగాణ ప్రభుత్వంలో ఎలాంటి పైరవీలు లేకుండా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం కౌడిపల్లిలో ఉద్యోగం చేస్తున్నాను. ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

**– మెగమ్మగారి ఆంజనేయులు, కానిస్టేబుల్, తొనిగండ్ల (మెదక్ జిల్లా)**

### ఒకప్పుడు డబ్బున్న వారికే ఉద్యోగాలు..



ఒకప్పుడు సర్కారు కొలువు అంటే శానా వరకు డబ్బున్న వారికి, పలుకుబడి ఉన్నోళ్లకే వచ్చేవి. దీంతో శానా మంది గ్రామీణ ప్రాంతాల్లో తమ పిల్లలను సదువుకోవడానికి పెద్దగా పంపించేవారు కాదు. ఎంత చదివినా సర్కారు కొలువు పేదోళ్లకు రాదనే అపవాదు ఉండేది. కానీ తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ సార్ దయవల్ల ఆ అపవాదు తొలిగింది. మా ఊరుతో పాటు శానా ఊరల్లో నిరుపేదలు, అట్టడుగు వర్గాల వారికి కొలువు వచ్చాయని, కారణం తెలంగాణ సర్కారే అని మా పిల్లలు అంటున్నారు.

**– భాగయ్య, ఆంజనేయులు తండ్రి, తొనిగండ్ల (మెదక్ జిల్లా)**

### మా కష్టం వృథా పోలేదు..



శానా కష్టపడి మా కొడుకును చదివించినం. నిరుపేద స్థితిలో ఉన్నా ఏనాడు బాధపడకుండా పెద్ద సదువులు సదివించినం. అప్పట్లో శానా మంది తెలంగాణలో కొలువులు రావని, ఆంధ్రోళ్లకే ఉద్యోగాలు వస్తాయని అంటుంటే. శానా బాధ అనిపించేది, కానీ ఏదో ఒక రోజు మనకు మంచి రోజులొస్తాయని నమ్మకం ఉండేది. ఆ నమ్మకం దేవుడు కేసీఆర్ దయ వల్ల నిజమైంది. జీవితాంతం ఆ సార్‌కు రుణపడి ఉంటాం.

**– కనకవ్వ, ఆంజనేయులు తల్లి, తొనిగండ్ల (మెదక్ జిల్లా)**

### మన బతుకులు మారుతున్నాయి..




కానిస్టేబుల్ ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. మా అమ్మనాన్నలు చాలా కష్టపడి చదివించారు. వ్యవసాయం చేసుకుంటూ నన్ను పోషించారు. ఉన్నత చదువులు చదివించే స్థోమత లేకున్నా నన్ను బాగానే చదివించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మన బతుకులు మారుతాయని అంటే ఏమో అనుకున్నా. కానీ నిజంగానే మన బతుకులు మారుతున్నాయి. ప్రస్తుతం వెల్దుర్తిలో ఉద్యోగం చేస్తున్న. ఇదంతా సీఎం కేసీఆర్ దయ. సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

**– ద్యాప మహేశ్,కానిస్టేబుల్, తొనిగండ్ల (మెదక్ జిల్లా)**

### ఎంత ఖర్చు అయితందోనని భయపడ్డా..



నా కొడుకు ఉద్యోగం కోసం ఎంతో ఖర్చు అయితందోనని శానా భయపడ్డా. ఎప్పుడు దిగులుగా ఉండేది. కానీ, పైసా ఖర్చు, పైరవీ లేకుండా కొలువు వచ్చింది. ఉమ్మడి రాష్ట్రం అయితే ఉద్యోగం వచ్చేది కాదేమో. ఎందుకంటే మా ఊర్లో శానా మంది సదువుకున్నోళ్లాను సుశిన. ఏండ్ల తరబడి సర్కారు కొలువుకు దరఖాస్తులు చేసేటోళ్లు. కానీ కొలువు వచ్చేది కాదు. దీంతో నాకు శానా సార్లు భయమేసేది. తెలంగాణ వచ్చాకే కేసీఆర్ సార్ దయవల్లే నా కొడుక్కు కొలువు వచ్చింది. గిప్పుడు శానా సంతోషంగా ఉంది.

**– ద్యాప మల్లయ్య, కానిస్టేబుల్ మహేశ్ తండ్రి, తొనిగండ్ల (మెదక్ జిల్లా)**

### పేదల జీవితాల్లో వెలుగులు..



తెలంగాణ సర్కారులో శానా మంది పేదోళ్ల పిల్లలకే ఉద్యోగాల్లో వచ్చాయని అంటున్నారు. శానా సంతోషంగా ఉంది. వ్యవసాయం చేసుకుంట పూటపూటకు కష్టపడి నా కొడుకును సదివించుకున్న. గి దినాంలో మీవోడికి సర్కారు నౌకరి వస్తదా.. అని శానా మంది ఎతిరేకం చేసేటోళ్లు. సర్కారు కొలువు రావాలంటే పైసలు లేనిదే రాదనేటోళ్లు. కానీ నా కొడుకు అమ్మా.. తెలంగాణ వస్తే మన బతుకులు మారుతాయి, ఉద్యోగాలు వస్తాయని పదేపదే చెప్పేటోడు. గిప్పుడు అదే నిజమైంది. మావోడికి సర్కారు నౌకరి వచ్చింది. గిదంతా.. కేసీఆర్ సార్ పుణ్యమే..

**– లక్ష్మి, కానిస్టేబుల్ మహేశ్ తల్లి, తొనిగండ్ల (మెదక్ జిల్లా)**

## మా ఓటు సునీతారెడ్డికే..

### కొల్చారం గ్రామ ముదిరాజ్ సంఘం మద్దతు

కొల్చారం/చిలిపిచెడ్, నవంబర్ 19: తమ ఓటు నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికే అని కొల్చారం గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు మద్దతు తెలిపారు. మాసాయిపేట మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ ఆశ్నగారి కిష్టయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎండుగుల కృష్ణ, రైతు సమితి కోఆర్డినేటర్ గ్యాస్ కృష్ణ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం సభ్యులు సుమారు 50 మంది కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు ఎండుగుల సుదర్శన్, సార దుర్గయ్య, కోటయ్య, నారాయణ, సత్తెయ్య, లక్ష్మీనారాయణ, నర్సింహులు, గోపీ, జగన్, తదితరులు ఉన్నారు. వీరి వెంట మెదక్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజాగౌ డ్, బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు ముత్యం ప్రవీణ్‌కుమార్, పాల్వంచ కృష్ణాగౌడ్, ఉపసర్పంచ్ చెన్నయ్య, మాజీ ఉపసర్పంచ్ చిన్న రాములు తదితరులు ఉన్నారు.



కొల్చారం: సునీతారెడ్డిని కలిసి మద్దతు తెలుపుతున్న ముదిరాజ్ సంఘం



చిలిపిచెడ్: రాందాస్‌గూడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సర్పంచ్ యాదగిరి

### గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

చిలిపిచెడ్ మండలంలోని రాందాస్‌గూడలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టో గురించి వివరించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంకం యాదగిరి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహించారు. నర్సాపూర్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ మాటలు నమ్మితే అధోగతే



కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మితే రైతులం అధోగతి పాలౌతాం. 50 ఏండ్ల క్రితం నుంచి పదేండ్ల వరకు చేసిన మోసాలు చాలక మళ్లీ ఇప్పుడు ఎన్నికల పుణ్యామా అని కొత్త నినాదం పటేల్ పట్వారీ వ్యవస్థను మళ్లీ తీసుకు వస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారు. వారి మాటలు ఎప్పుడూ కూడా రైతులు నమ్మద్దు. ఎప్పుడో సమసిపోయిన పటేల్ పట్వారీ వ్యవస్థను మళ్లీ తెస్తమంటున్నరు. ఆ వ్యవస్థ మాకొద్దు.. మాకు బతుకునిచ్చే కేసీఆర్ సర్కారే కావాలె.

**– అశోక్‌రెడ్డి, కోనాపూర్, రామాయంపేట**

## ప్రజలంతా ఆలోచించి ఓటేయాలి

కాంగ్రెస్ హయాంలో తెలంగాణ అంటేనే కరువు ప్రాంతం. రైతు ఆత్మహత్యలు.. చేనేతల ఆకలి చావులు.. వలసలే ఉండేవి. పచ్చబడ్డ తెలంగాణను కిందికిపోయేటట్టు.. దళారీ రాజ్యం (పటేల్ పట్వారీ వ్యవస్థ) వచ్చేటట్టు చేస్తమని బాజాప్తా కాంగ్రెసోళ్లు చెబుతున్నరు. కరువు తెచ్చిన కాంగ్రెస్ కావాలా ? బతుకునిచ్చిన బీఆర్ఎస్ కావాలా ? ప్రజలంతా ఆలోచించి ఓటేయాలని అంటున్నారు రామాయంపేట వాసులు.

**– రామాయంపేట, నవంబర్ 19**

### కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు..



స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న కొత్త నాటకం పటేల్ పట్వారీ వ్యవస్థ. వారి మాటలను ఎప్పటికీ నమ్మొద్దు. అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ ఎన్ని నాటకాలైనా ఆడుతుంది. అందులో ప్రజలను మభ్యపెట్టి మళ్లీ పటేల్ పట్వారీ వ్యవస్థను ముందుకు తెస్తుంది. రైతులెవ్వరూ కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు మోసపోవద్దు.

**– నాళం కిష్టాగౌడ్, చల్మెడ ఉమ్మడి రామాయంపేట**

### మోసాల పుట్ట కాంగ్రెస్ పార్టీ



మోసాలు చేయడంలో కాంగ్రెస్‌కు పెట్టింది పేరు. మళ్లీ పాతబడ్డ పటేల్ పట్వారీ వ్యవస్థను ముందుకు తెస్తున్నరు. వారిని ఏ రైతు కూడా నమ్మద్దు. రాష్ట్ర రైతులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సార్‌నే బలపరుద్దాం. నా ఉద్యోగ సర్వీసులో కాంగ్రెస్ మోసాలను శానా చూసిన. అందులో ఇదొక్కటి. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ నాయకులు దిట్ట. వారు నమ్మించి మోసాలు చేసే నాయకులు.. వారిని నమ్మితే మనల్ని నట్టేటా ముంచుతారు. రైతులు తస్మాత్ జాగ్రత్త.

**– సార్గు లక్ష్మణ్, రిటైర్డ్ టీచర్, రామాయంపేట**